# సాయంకాలం

చిన్నప్పటినుండి మధ్యాహ్నం పడుకునే అలవాటు మాత్రం పోలేదు. ఏదో కాయకష్టం చేసి అలసిపోయినట్టు ఆదమరచి నిద్రపోతున్నాడు. రోజూ చెప్తూనే ఉన్నా పట్టించుకోడు. ప్రతీ మధ్యాహ్నం రెండు గంటల పాటు పడుకోవడం, రాత్రి నిద్ర పట్టక హాల్ లో పచార్లు చెయ్యడం, అలా పచార్లు చేస్తూ వచ్చే పదేళ్ళలో జీవితంలో ఏమేమి చెయ్యాలో ఆలోచిస్తూ నడుస్తూనే ఊహల్లోకి వెళ్ళిపోవడం, ఆ ఊహల్లో నుండి బయటకి వచ్చి వర్తమానం పై కోపంతో అసంతృప్తిగా రోజుని ముగించడం - ఇదీ దినచర్య. తను తన పద్ధతులని మార్చుకోడు, తనకి లెక్చర్లు ఇచ్చే అలవాటు నేనూ మార్చుకోను. సరే, లేచాకా ఎలాగో డోస్ తప్పదు, పడుకున్నవాడిని లేపడం ఎందుకులే అని తన మంచానికి ఆనుకుని అయ్యప్పస్వామి భంగిమలో కిటికీలో నుండి కనిపిస్తున్న కొండల వైపు చూస్తూ కూర్చున్నాను.
ఇంచుమించు ఓ అరగంట తర్వాత కొద్దిగా కదిలాడు. హమ్మయ్య, లేచాడు అనుకోగానే మళ్ళీ అటు తిరిగి పడుకున్నాడు. సరే ఇంకా టైం అయినట్టు లేదు దొరగారికి అని తనవైపే చూస్తూ కూర్చున్నా. ఇంకో పావుగంటకి ఉలిక్కిపడి లేచాడు - నేనేమిటి, ఈ వేళలో నిద్రపోవడమేమిటి అని ఆశ్చర్యపోతున్నట్టుగా. ఈ లోకంలోకి రాగానే చివాలున తల తిప్పి పక్కనే ఉన్న నా వైపు చూసాడు, నువ్వేం చేస్తున్నావు ఇక్కడ అనే అర్ధంలో.
"అబ్బే ఏంలేదు, సాయంత్రం అవుతోంది కదా ఓ సారి పలకరించి వెళ్దామని వచ్చా.." అడక్కుండానే చెప్పాను. నా మాటలు ఏమీ పట్టనట్టు మంచం మీదనుండి లేచి బాత్ రూం వైపు నడిచాడు. తన పద్ధతి నాకు అలవాటే. నిద్ర లేచాకా చాలాసేపటి వరకు ఏమీ మాట్లాడడు. ఎవరితోనో అయితే పరవాలేదు కానీ నాతో కూడా మాట్లాడకపోతే వొళ్ళు మండదా! కానీ ఏం చేస్తాం. తన పద్ధతి అంతే. ఎలాగోలా మాటల్లోకి దించే ప్రయత్నం చేస్తూ "ఏంటి, రాత్రి నిద్ర పట్టలేదా..?" అని అడిగాను. ఏంటా పిచ్చి ప్రశ్న అన్నట్టు చూసాడు కానీ సమాధానం మాత్రం చెప్పలేదు. నన్నసలు పట్టించుకోకపోవడంతో కోపం వచ్చింది కానీ తన మీద అలిగి సాధించేది ఏమీ లేదని సరిపెట్టుకుని తన వెంటే తిరగసాగాను.
టీ పెట్టుకోవడం అయింది మహానుభావుడికి. కప్పులోకి పోసుకుంటూ నా వైపు చూసాడు నువ్వు కూడా తాగుతావా అన్నట్టు. నీకు తెలియదా అని కళ్ళతోటే సమాధానం చెప్పాను. నా సమాధానం అర్ధమైనట్లుగా మొత్తం టీ తన కప్పులోనే పోసుకుని ఊదుకుంటూ బాల్కనీ లోకి నడిచాడు. ఆ టీ పడితే కాస్త ఈ లోకంలోకి వస్తాడనే ఆశతో తన వెంటే నేనూ నడిచాను.
మహారాజులా కుర్చీలో కూర్చుని ఎదురుగా ఉన్న స్టూలు మీద కాళ్ళు పెట్టుకుని తాగడం మొదలుపెట్టాడు. మొదటి చుక్క పడింది ఇక మాట్లాడడం మొదలుపెడతాడు అనుకుంటూండగా నా ఊహ నిజమే అన్నట్లు "..ఆహా, ఈ టీ లో ఏం పెట్టాడో కానీ దేముడు ఒక చుక్క పడితే చాలు, స్వర్గం." అన్నాడు.
'హమ్మయ్య, మాట్లాడేసాడు ఇక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..' అనుకుంటూ నేను కూడా మాటాడటం మొదలుపెట్టాను.
"నిజమే, అదేదో సినిమాలో టీ తాగని వాడు దున్నపోతై పుడతాడని చెప్పారు కూడా కదా!"
ఆ మాట విని నా మొహం వైపు నవ్వుతూ చూసాడు. తనని ప్రసన్నం చేసుకోవడానికే ఆ మాట అన్నానని అర్ధమైనట్టుంది. నవ్వుతూ మాట్లాడటం మొదలుపెట్టాడు.
"సరేగానీ, నువ్వు వచ్చిన పని కానీ. ఆ డోసేదో ఇచ్చేస్తే నేను పేపర్ చదువుకుంటా."
"డోసంటూ ఏమీ లేదు కానీ ఒక ప్రశ్న మాత్రం ఉంది."
"ఏదీ, నా జాబ్ గురించేనా?"
"అవును. బయట జనాలకి ఉద్యోగాలు దొరక్క ఇబ్బంది పడుతోంటే నీకేం బాధొచ్చి పడింది? మహారాజులా చూసుకుంటున్నారు ఆఫీస్ లో. బోలెడు జీతం. నీకు ఒక్క ఫ్రెండ్ కూడా లేడు. ఎలాంటి అలవాటులూ లేవు. పొరపాటున కూడా బయటకి వెళ్ళవు. వచ్చిన డబ్బంతా అలా బ్యాంకుల్లో మూలుగుతోంది. అసలు ఏ కారణం

వల్ల నువ్వు పార్ట్ టైమే జాబ్ చెయ్యాలని నిర్ణయించుకున్నావు?"
"నా మనసు బాగోకపోతే నేను పని మీద దృష్టి పెట్టలేను. మనసు పెట్టి పని చెయ్యలేనప్పుడు నేను తీసుకునే వేలకొద్దీ డాలర్లకి న్యాయం చేకూర్చలేను. అందుకనే కొన్ని వారాల పాటు పార్ట్ టైం చేద్దామని నిర్ణయించాను."
"నీ మనసు పాడు చేసింది ఏమిటో నాకు తెలియదు గానీ దాని విలువ మాత్రం నెలకి లక్ష రూపాయిలు."
"అవును. కానీ అన్నిసార్లూ డబ్బే లోకం కాదు మనిషికి."
"సరే సరే, అసలు సంగతి చెప్పు. ఏమైంది అసలు?"
"నీకు తెలియనిది ఏమీ కాలేదు. అయినా నా జీవితంలో నీకు తెలియకుండా ఏం జరుగుతుంది?"
"అదీ నిజమే. కొంపతీసి ఇండియాలో నీకు నచ్చిన ఆ పాత ప్రభుత్వం మారిపోవడం కాదు కదా!"
"నిజం చెప్పాలంటే, ప్రభుత్వం మారినందుకు నాకు కొంచెమే బాధగా ఉంది. కానీ ఇంకోసారి స్పష్టంగా లేని తీర్పు ఇచ్చిన ప్రజల మీద కోపంగా ఉంది. ఏదేమైనా ఇప్పుడు నా మనసు బాధ పడుతున్నది ప్రజల తీర్పు గురించో, ప్రభుత్వ పతనాల గురించో కాదు."
"అయితే ఇంకేముంది, ఎప్పటిలానే నీ భవిష్యత్తు గురించి, వచ్చే పదేళ్లలోపు నువ్వు చేద్దామనుకుంటున్న పనుల గురించి, నీ దేశంపై ఆ పనుల ప్రభావం గురించి ఆలోచిస్తూ ఉండి ఉంటావు. ఆ ఆలోచనలకి రోజూ రాత్రి దొరుకుతున్న టైం సరిపోయి ఉండదు. పని చేసే టైం తగ్గించుకున్నావు. అవునా?"
"అవును. నూటికి నూరు శాతం నా ఆలోచనలకి టైం దొరకడం లేదనే పని చేసే టైం తగ్గించుకున్నా. మాటి మాటికీ 'వచ్చే పదేళ్ళలోపు' అని అదేదో ఎంతో దూరంలో ఉన్నట్టు చెప్తావెందుకు? భవిష్యత్తుకి గతానికి మధ్య ఈ వర్తమానమే ఆనకట్ట అని నీకు వందసార్లు చెప్పాను. గతంలో సాధించింది ఏమీ లేదు. కానీ భవిష్యత్తులో అలా కాకూడదు. అంతేకాక పదేళ్ళలోపు అంటే సరిగ్గా పది సంవత్సరాల తర్వాత నా ఆలోచనలని కార్యరూపంలో పెడతానని కాదు. నా పనుల ఫలితం కూడా అప్పటికి వచ్చేయాలి. అది నా గోల్."
"నిజమే! భవిష్యత్తుకి, గతానికి వర్తమానమే వారధి. ఒప్పుకుంటా. నిజానికి నేను చెప్తున్నది కూడా అదే. భవిష్యత్తులో ఏవో అద్భుతాలు చెయ్యాలని ఆశ పడవచ్చు. ఆ ఆశలకి ఊహా రూపం కూడా ఇవ్వవచ్చు. కానీ నీ ఆశలకి, అంతులేని నీ ఊహలకి ఎప్పుడు ఆనకట్ట వెయ్యాలో నీకు తెలియాలి. నీకున్న పరిమితులు మర్చిపోకూడదు. నువ్వు గతంలో సుఖపడిన దాఖలాలు లేవు. ఒక్క రోజు కూడా టైంకి తిన్నట్టు గానీ, పడుకున్నట్టు గానీ నాకు గుర్తు లేదు. నువ్వు కలిసే స్నేహితులు కానీ, నిన్ను కలిసే స్నేహితులు కానీ లేరు. నీ తీరు మారకపోతే భవిష్యత్తులో కూడా ఇలాగే ఏ సుఖమూ లేకుండా గడుపుతావు. ఇప్పుడు సరే, నువ్వు ఏకాకివి. కానీ భవిష్యత్తులో నిన్ను నమ్ముకుని నీతో బ్రతకడానికి తనవాళ్ళని వదులుకుని వచ్చే ఒక అమాయకురాలు నీలానే బ్రతకాలి, నీలానే సుఖానికి దూరం అవ్వాలి అంటే అది నిజంగా దారుణం. నీ లాజిక్ ప్రకారమే చెప్తున్నా. భవిష్యత్తు గురించి అవసరానికి మించి ఆలోచిస్తూ ప్రస్తుతంలో కనీస సుఖాలకి కూడా దూరం కాకు. జరగబోయేది ఎలాగో జరుగుతుంది. అలా అని అంతా దేముడి చేతిలో పెట్టి చోద్యం చూస్తూ కూర్చోమని చెప్పను. నీకున్న ఆలోచనా శక్తి అపారం. ఒప్పుకుంటా. కానీ మానసికంగా ఇంకొంచెం ప్రశాంతంగా ఉంటే నువ్వు ఇంకా ఎంత బాగా ఆలోచించగలవో ఒక్కసారి ఆలోచించు. నీకున్న శక్తి నీ ఆలోచనా విధానం. ఆ శక్తిని వృద్ధి చేసుకోవడానికి మానసిక ప్రశాంతత చాలా అవసరం. అర్థం అవుతోందా?"
"ఓ, చాలా బాగా అర్థమైంది. కాకపోతే కనీస సుఖాలంటే నీ అర్థమేమిటో నాకు తెలియదు. నాకు తెలిసినంత వరకు నేను ఎప్పుడూ కష్టపడుతున్నట్టు అనుకోలేదు. నిజానికి నాకెప్పుడూ అలా అనిపించలేదు. ఇకపోతే స్నేహితులు - నిజమే, నాతో ఎవరూ మాట్లాడరు. నేనెవరితోనూ మాట్లాడను. నాకు మాట్లాడాలని అనిపించదు కూడా. కొన్ని సంవత్సరాలుగా ఒక్కడినే ఉండటానికి కూడా కారణం అదే. కానీ నా దేశంలో ఉన్న 'నా' వాళ్లతో నా పరిచయాలని నేను పోగొట్టుకోలేదు. పోగొట్టుకోను కూడా. ఎవరు నా పక్కనుంటే నా

ఆలోచనల ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతుందో, ఎవరి చేయూత ఆకాశమే హద్దుగా నా ఉత్సాహాన్ని పెంచుతుందో, ఎవరి మాటసాయం నిరాశ, నిస్పృహలను నా దరిచేరనివ్వదో ఆ నా వాళ్ళు నా అందుబాటులో ఉన్నంత కాలం నాకే సుఖమూ అక్కర్లేదు. నాకే లోటూ తెలియదు."

"అమ్మో, నీతో మాట్లాడటం చాలా కష్టం. సరే, నీ పద్ధతిలోనే కొనసాగు. కానీ చివరిగా ఒక మాట చెప్తాను. నీకు తెలుసు - వెయ్యి మైళ్ళ ప్రయాణమైనా ఒకే అడుగుతో మొదలవుతుంది. వెయ్యి మైళ్ళ గురించీ ఆలోచించి మొత్తం ప్రయాణానికి ప్రణాళిక సిద్ధం చేసుకోవడం ఒక పద్ధతి. మొదటి అడుగు అతి జాగ్రత్తగా వేసి ప్రయాణాన్ని మొదలుపెట్టి ముందుకు సాగడం మరో పద్ధతి. ఏ పద్ధతి ఎంచుకుంటావో నీ ఇష్టం. నాకేది ఇష్టమో నీకు తెలుసు."

"చాలా సుతిమెత్తగా చెప్పవల్సింది చెప్పావు. నీకిష్టమైన పద్ధతిలోనే 'మొదటి అడుగు' వెయ్యబోతున్నా. వెయ్యి మైళ్ళ ప్రయాణం అతి త్వరలో మొదలవుతుంది, సిద్ధంగా ఉండు."

*9th June 2004*